# ఆకాశవాణి...విన్నారు

పూర్వఫల్గుణి

రాత్రి ఎనిమిది అవుతోంది. వివిధభారతిలో పాటలు వస్తున్నాయి. చలపతిరావుగారింట్లో భోజనాలు అపుడే ముగిశాయి. అందరూ అంటే చలపతిరావుగారు, భార్య సుశీలమ్మ, ముగ్గురు కొడుకులూ, ఇద్దరు కోడళ్ళు, కూతురు శ్రీలేఖ, మనవడు కృష్ణతీరిగ్గా హాల్లో కూర్చున్నారు. రేడియోలో అడ్వర్టయిజ్ మెంట్ అయి పాట మొదలయింది. ఓ యిద్దరు ప్రేమికులు వానలో తడుస్తూ, చలిజ్వరం వచ్చినవాళ్ల లాగా వణుకుని గొంతులో పలికిస్తూ కోరికలు వెళ్ళబోసుకుంటూన్న పాట అది. రేడియో దగ్గరే కూర్చున్న శ్రీలేఖ మెల్లగా, ఎవరూ గమనించే అవకాశం లేకుండానే స్టేషన్ మార్చింది. మారుస్తూండగానే గుర్తువచ్చిందామెకి ఆ రోజు నాటిక వస్తుందని.

తల్లి ఎపుడూ "ఎప్పుడూ ఆ సిన్మాపాటలేమిటే, నాటకాలో, సంగీతకచేరీలో పెట్టవచ్చుకదే, అందరం వింటాము" అనటం కూడా గుర్తువచ్చి, "అమ్మయ్య, అరగంటసేపు అందరం సరదాగా నాటిక వినవచ్చు" అనుకుంటూ తల్లితో చెప్పింది. "అమ్మా, నాటకం వస్తుంది వినండే" అని.

"'ఆకాశవాణి' తర్వాత కార్యక్రమం కొంచెంసేపట్లో వింటారు." అనౌన్స్‌మెంట్ పూర్తి అయ్యీ కాకుండానే మరో అనౌన్సర్ గొంతు హెచ్చరించింది, "ఆకాశవాణి యిపుడు 'రచయిత్రి మొగుడు' నాటిక రిలే వింటారు." అని.

'ముందే మేంరెండుసార్లు హెచ్చరించాము. ఇది 'ఆకాశవాణి' సుమండీ అని, తర్వాత మమ్మల్నసుకొని లాభం ఏమీ ఉండదు' అన్నట్లుగా ఉన్న ఆ రెండు బెదిరింపులూ పూర్తి అయి, అసలు నాటకం మొదలయింది.

సుజాత రచయిత్రి, ఆమెను పెళ్ళిచూపుల్లో చూసి, రచయిత్రి అని తెల్సుకొని మరీ పెళ్ళి చేసుకుంటాడు శేఖర్. పెళ్ళి అవగానే మొదలవుతాయి అతని పాట్లన్నీ, తమాషా ఏమిటంటే ఆమె రచయిత్రి కావటం వలన అతనికి కల్గిన ఆటంకం దాంపత్య జీవితం గడవడానికే కాదు, మరే విధమైన నిత్యకృత్యాలకూ కాదు, నాటక రచయిత దృష్టిలో.

మొదటి రాత్రి భార్యామణి కథలు గిలుకుతూ కూర్చుంటుంది. ఆయనగారు ఆవిడ పొందుకోసం తహతహలాడిపోతూ గొంతులో 'తమకం' ఒలకబోస్తూ డైలాగులు అప్పజెబుతున్నాడు. అవిడేమో "అబ్బ, ఉండండీప్లీజ్" "మావారు మంచివారుట" అంటూ గారాలు పోతోంది.

ఆ డైలాగులు ప్రారంభం కావటంతో, రేడియో నాటకం కంటే సజీవమైన నాటకం ఆ హాల్లో మొదలయింది. అందాక ఎంతో కుతూహలంగా, తీరిగా కుర్చీల్లోనూ, గుమ్మాలకి చేరబడీ కూర్చున్నవారంతా, ఆ డైలాగులు వినగానే యిబ్బందిగా కదలటం, తలలాడించుకోవటం, (తామే నలుగురిలోనూ ఆ పాత్రల్లా ప్రవర్తించినట్లు) సాగించారు. అంతదాకా మరిచిపోయిన పనులన్నీ అందరికి ఒకేసారి గుర్తుకువచ్చేశాయి.

నాటకానికి నాందీ పలుకుతూ, "అయ్యో, నా మతిమండిపోనూ, ప్రొద్దున్న టిఫిన్‌కిపప్పు నానబోయటం మర్చిపోయాను." అంటూ తన భారీ శరీరాన్ని అతి కష్టంమీద లేపారు సుశీలమ్మగారు.

"ఉండండి అత్తయ్యా, నేనానబోస్తాను" పెద్దకోడలు రుక్మిణి లేచి "పడుకోరా కిట్టిగా, మళ్ళీ స్కూల్ కైంకి లేవవు" వెడుతూ, వెడుతూ కొడుక్కి ఓ సలహా పారేసి మరీ వెళ్ళింది.

"నానిగాడికి పాలు పట్టించే టైమయింది, తిక్క పెట్టాడంటే ఓ పట్టాన వదలడుకూడాను. పాలసీసా చేతబట్టుకుని వెడుతూన్న రెండో వదిన శారద, భర్తవైపు నవ్వుతోకూడినచూపు విసరటం, అతను మొహం కందగడ్డలాచేసుకోవటం శ్రీలేఖ దృష్టిని దాటిపోలేదు.


"ఈవేళ ఏమిటో నిద్ర పెందరాళేముంచుకొచ్చేస్తోంది" సంజాయిషీ చెప్తున్నట్లుగా అని తనగదిలోకి వెళ్ళిపోయారు చలపతిరావుగారు.

"లైబ్రరీ పుస్తకం రేపయినా ఇచ్చేయాలి ఇప్పటికే ఆలస్యమయిపోయింది" పెద్దకొడుకు శంకరం డైలాగు.

"చిన్నన్నయ్యా, నాకు ఆ బాలెన్స్ షీట్ టాలీ కావటంలేదురా, ఇంటర్నల్స్ దగ్గరకొస్తున్నాయికూడానూ, కాస్తచూద్దూ" మూడోవాడు శ్రీనివాస్, చిన్న అన్నయ్య గోపాలాన్ని కూడా రక్షిస్తూ, (డైలాగ్‌కోసం తడుముకో నక్కర లేకుండా) స్టడీరూమ్‌లోకి లేపుకుపోయాడు.

అనౌన్సర్లకంటే గొప్పగా "నాటకం వస్తోందోచ్" అని ఎగిరినందుకు శిక్షఅన్నట్లుగా కుర్చీకి అంటుకుపోయి జరుగుతూన్న తతంగాన్ని తలదించుకునే గమనిస్తోంది శ్రీలేఖ.

మొదటి రాత్రి భార్యామణి కథలు గిలుకుతూ కూర్చుంటుంది. ఆయనగారు ఆవిడ పొందుకోసం తహతహలాడిపోతూ గొంతులో తమకం ఒలకబోస్తూ డైలాగులు అప్పజెబుతున్నాడు. అవిడేమో అబ్బ ఉండండీ ప్లీజ్ మావారు మంచివారుట అంటూ గారాలు పోతోంది.



"ఏమిటత్తయ్యా అందరూ ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు అలా వెళ్ళిపోయారు నాటకం వినకుండా" ఆరేళ్ళ కిట్టిగాడి ధర్మసందేహం.

తానూ లేచి గదిలోకి వెళ్ళబోయి ఆగిపోయింది శ్రీలేఖ నాటిక పూర్తిగావిని ఆకాశవాణికి ఓఉత్తరం ఘాటుగా వ్రాయాలని నిశ్చయించుకుంటూ.

సుజాత రాత్రిళ్ళు కథలు రాసుకోవటం. (మొగుడు ఆఫీస్‌కెళ్ళాక పగలంతా ఏంచేస్తుందో ఆ మహాతల్లి) ఈ మొగుడుగారు మూలుగులూ, నిట్టూర్పులూ వగైరాలతో విరహవేదననుభవించటంతప్ప మరేమీలేను ఆనాటకంలో!

అవన్నీ వినడానికి ఆహాల్లో శ్రీలేఖతో పాటుగా ప్రాణంలేని కుర్చీలు, బల్లలూ, జ్ఞానంతెలియని కిటిగాడూ మిగిలారు

పనుల వంక పెట్టుకొని వంటింటో దూరిన వాళ్ళు నాటకంఅయ్యేదాకా బయటపడనేలేరు సుబ్బరంగావున్న వంటింట్లో అంతసేపూ ఏం సర్దారో మరి.

* * *

వారం గడిచింది.

"ఆకాశవాణి (మళ్ళీ వెక్కిరింపు. పాపం వాళ్ళ ముందుజాగ్రత్తనో. శ్రోతల మానసికారోగ్యంపట్ల వాళ్ళకున్న శ్రద్ధాశక్తులనో మెచ్చుకోవాలి) ఇప్పుడు మీరు శ్రోతలతో ముఖాముఖి (ఔనూ ఇంతకీ అది ముఖాముఖి ఎలా అయినట్టు? ఏమో బాబూ వాళ్ళకే తెలియాలి) వింటారు" అనౌన్స్‌మెంట్ పూర్తవగానే ప్రహసనం మొదలైంది.

"ఏయ్, అన్నిఉత్తరాలూ నువ్వేనేంటమ్మా చదవటం, నాకూ కొన్ని ఇవ్వకూడదేమిటీ"

"...... ...... ......"

"ఔనూ ఏమిటంతలా ఆలోచించేస్తున్నావు రచయిత్రిలాగా. ఆఁ అన్నట్టు 'రచయిత్రి' అంటే గుర్తువచ్చింది. మొన్న మనం ప్రసారంచేసిన 'రచయిత్రి మొగుడు' నాటకం శ్రోతలని విశేషంగా ఆకర్షించినట్టు వారి ప్రశంసల వల్ల తెలుస్తోంది. మరా ఉత్తరాలు చూద్దామా"

"ఈ నాటిక సహజత్వానికి చాలాదగ్గరగా వుందసీ ఆ అరగంటా ఇంటిల్లిపాదీ రేడియో ముందునుంచికదలలేకపోయామంటే నమ్మండి" అనీ...... ......

సకుటుంబంగా ఆగొప్ప శృంగార నాటకాన్ని ఆనందించగలిగిన రసికాగ్రణి ఎవరో అని ముందుకువంగింది శ్రీలేఖ.

"అనీ...... ......ఈ లేఖ ఎవరు రాశారంటే, చిక్కడపల్లి నుంచి 'శ్రీలేఖ'...." తాను కుదిర్చిన ప్రాసకి తానే మురిసిపోతున్న ఆ అనౌన్సర్‌కి తెలియదు పాపం, సదరు శ్రీలేఖ తన మహాత్యంవల్ల కుర్చీకి అంటుకుపోయిందని,

వదినగారి కుదుపుతో ఈలోకంలోకి వచ్చిన శ్రీలేఖచేతులు రేడియో స్విచ్చిని ఆపేయటంతో తమకసి తీరనట్లుగా ప్లగ్‌నికూడా పీకి పారేశాయి. ✻